

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు విజయ జ్యోతి డిమాండ్ చేశారు. ఆమెరకు బుధవారం కడప ప్రెస్ కార్యాలయం వద్ద ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండాలని ముద్రించిన పోస్టర్లను విజయ జ్యోతి ఆవిష్కరించారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ గోస్ పీర్, సంజయ్ కాంత, సిరాజుద్దీన్, శీలం గంగయ్య, రఫీఖ్ ఖాన్ పాల్గొన్నారు.

ఐసిడిఎస్‌లో ఇష్టారాజ్యం!

- రూ.31.77 లక్షల ఫర్నీచర్ కొనుగోల్‌మాల్?
- విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి
- నిద్రమత్తులో జిల్లా అధికార యంత్రాంగం
- కలెక్టర్ గారూ దృష్టి సారించండి



చాపాడులోని అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఇష్టారాజ్యం నడుస్తోంది. ప్రభుత్వం ఐటీఐల అంగన్వాడీ కేంద్రాల్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడానికి ఉద్దేశించి అంగన్వాడీ కేంద్రానికి రూ.ఆరు వేలు చొప్పున విడుదల చేసింది. ఇందులో ఐసిడిఎస్ జిల్లా అధికార యంత్రాంగం ప్రతి అంగన్వాడీ కేంద్రానికి నిధులను జమ చేయకుండా సొంతంగా చాప, స్టవ్, మార్కర్, కుర్చీ తదితర వస్తువులను కొనుగోలు చేసి, ఆ మేరకు అంగన్వాడీ కేంద్రాల నుంచి వసూలు చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఉదంతంపై కలెక్టర్ విచారిస్తే ఇటువంటి మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అంగన్వాడీ కేంద్రాలకు తాత్కాలిక మరమ్మతు నిధులు జమ చేయడంపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 2,389 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 1,069 అంగన్వాడీ కేంద్రాలు సొంత భవనాల్లో ఉన్నాయి. ఇందులోని 1,059 అంగన్వాడీ కేంద్రాల్లో తాత్కాలిక మరమ్మతులకు ఉద్దేశించి ప్రతి అంగన్వాడీ కేంద్రానికి రూ.ఆరు వేల చొప్పున ప్రభుత్వం జిల్లా మాతా శిశు సంక్షేమశాఖ ఖాతాలో జమ చేసింది. జిల్లా ఐసిడిఎస్ అధికార యంత్రాంగం 1,059 అంగన్వాడీ కేంద్రాల ఖాతాలో నిధులను జమ చేయాల్సి ఉంది. రూ.31.77 లక్షలను జిల్లా ఐసిడిఎస్ అధికార యంత్రాంగం అంగన్వాడీ కేంద్రాల ఖాతాల్లో జమ చేయ కుండా, అనధికారికంగా సొంతంగానే ప్యానులు, చాపలు, మార్కర్లు, కుర్చీలు, లైట్లు, స్టవ్‌ల కొనుగోళ్లు చేసి సరఫరా చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు పాలు, గుడ్లు, పౌష్టికాహారం సరఫరా సహా ఇతర అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తే టెండర్లు పిలవాలి. అనంతరం టెండరు దక్కించుకున్న కాంట్రాక్టు ఏజెన్సీ ద్వారా సంబంధిత సరుకును కొనుగోలు చేసి అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయడం తెలిసిందే. జిల్లాలో ఇటువంటి పారదర్శక ప్రమాణాలను పాటించకుండా అనధికారికంగా సొంతంగానే కొనుగోలు చేసి సరఫరా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతటితో ఆగకుండా ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన తాత్కాలిక ఫర్నీచర్, ఇతర పరికరాల మరమ్మతు నిధులను సైతం తిరిగి అంగన్వాడీ కేంద్రాల ఉద్యోగుల నుంచి బలవంతంగా వసూలు చేసుకుంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఫర్నీచర్, ఇతర పరికరాల తాత్కాలిక నిధులు మంజూరుపై ప్రశ్నించిన అంగన్వాడీలపై బెదిరింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే అంగన్వాడీ యూనియన్ నాయకులు పలుమార్లు కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. జిల్లా సర్వోన్నత అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి అంగన్వాడీ కేంద్రాల తాత్కాలిక మరమ్మతుల నిధుల దుర్వినియోగంపై విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. దీనిపై ఐసిడిఎస్ జిల్లా ఉన్నతాధికారిని ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నిస్తే అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

అనధికారిక కొనుగోళ్లపై విచారణ చేపట్టాలి

అంగన్వాడీ కేంద్రాల్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడానికి విడుదల చేసిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి. ఐసిడిఎస్ శాఖలో అధికారులపై రహస్య విచారణ చేపడితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటువంటి ఘటనలు పునరావృతం గాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- బి.మనోహర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, కడప.

‘సీమ’ ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాలి

- సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

ప్రజాశక్తి-కడప అర్బన్

సాగునీటి వనరుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలని, రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి బడ్జెట్లో 10 శాతం నిధులు కేటాయించాలని, ప్రాజెక్టులకు నిధులు, నికర జలాలు కేటాయించాలని, నిర్మాణంలో ప్రభుత్వ అలసత్వాన్ని వీడాలని, రాష్ట్ర విభజన జరిగిండే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్లో పది శాతం నిధులు కేటాయించాలని రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ భాషా ప్రయుక్త రాష్ట్రంగా విడిపోవడానికి తెలుగు ప్రాంత అభివృద్ధి నిర్లక్ష్యం కారణమన్నారు. మరో మారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి విస్మరించడమే కారణమని చరిత్ర హెచ్చరిస్తున్న పాలకులు, ప్రభుత్వాలు పట్టించుకోకుండా, అభివృద్ధి వికేంద్రీకరణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. మళ్లీ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతీయ ఉద్యమాలు రావడానికి అవకాశం కల్పిస్తున్నారని పాలక ప్రభుత్వాలను హెచ్చరించారు. 48 సంవత్సరాలుగా రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికి, రిజర్వాయర్ల వంటి కాలువలు, పిల్ల కాలువలు పూర్తికి శ్రద్ధ కనపెట్టడం లేదని గుర్తు చేశారు. రాయలసీమలో రాష్ట్ర జనాభాలో 30 శాతం జనసాంద్రత కలిగి ఉందని, 36 శాతం వ్యవసాయానికి అనుకూలంగా భూమి ఉందని, కానీ 7 శాతం భూమికే మాత్రమే నీరు అందుతోందని ప్రభుత్వ లెక్కలు తెలుపుతున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి పాలక ప్రభుత్వాలు రాష్ట్ర బడ్జెట్లో 10 శాతం నిధులు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వద్ద సీమ ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయింపుకై పోరాడాలని పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తుంగభద్ర డ్యామ్ 70 సంవత్సరాల కిందట నిర్మించారని మరమ్మతులు నోచుకోక 29వ గేటు కొట్టుకుపోయిందని, కొత్త గేటు నిర్మాణం చేయమంటే వెల్డింగ్ చేసి తుప్పు పట్టిన గేట్ పెడతామంటున్నారని విమర్శించారు. రూ.86 వేల కోట్లతో గోదావరి నీరు రాయలసీమలోని బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్దకు ఎత్తిపోతల ద్వారా తెస్తామని నమ్మబలుకుతున్నారని, ఎన్ని దశాబ్దాలు పడుతుందో తెలియదని, రాష్ట్రంలో ప్రభుత్వం భవిష్యత్తు నాలుగున్నర సంవత్సరం తమ కాలవ్యవధిలో ప్రజలను మభ్యపెట్టి జారుకోవడానికి పన్నిన కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. నీలం సంజీవరెడ్డి మొదలుకుని పి.వి.నరసింహారావు వరకు అనేకమంది రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులుగా ఎన్నికైన రాయలసీమ తీవ్ర క్షమ విముక్తికి కృషి చేయలేదని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల కరువు సమస్యలను వారి రాజకీయ పదవుల అభివృద్ధికి ఉపయోగించుకున్న చరిత్ర ఉందన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ ప్రజలను భ్రమలకుగురి చేస్తుంటే, మరోవైపు ప్రతిపక్ష పార్టీ అధికారం కోసం పాకులాడుతూ ఉందని, ప్రజల సమస్యలు అధికార, ప్రతిపక్ష పార్టీలు గాలికి వదిలేశాయని పేర్కొన్నారు. డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి మాట్లాడుతూ జిల్లాలో 3.03 లక్షల ఎకరాలు సాగుకు అవకాశం ఉందని తెలిపారు. కేవలం లక్ష ఎకరాలు మాత్రమే సాగవుతోందని, ఇది ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ గాలేరు-నగరి గ్రావిటీ ద్వారా నీరు సీమ పొలాలను తడుపుతూ ఉంటే, హంద్రీ నీవా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందుతుందని, ఈ రెండు ప్రాజెక్టులు ప్రభుత్వాలు పూర్తి చేయటానికి, అటవీ శాఖ క్లియరెన్స్ 30 ఏళ్లుగా తీసుకుని రాకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. సిపిఐ(ఎం.ఎల్.లిబరేషన్) సమన్వయకర్త బి.ఓబయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో విదేశీ దిగుమతులకు రాయితీలుస్తూ స్వదేశీ దిగుమతులను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు బి.నారాయణ మాట్లాడుతూ రాయలసీమ, ఉత్తరాంధ్ర డెల్టా ఏరియాలో కూడా మెట్ట ప్రాంతాలలో నీటిపారుదల సౌకర్యాలు లేక వెనుకబాటుతనానికి గురవుతున్నాయని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో ఒక కారు పంటకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. హేతువాద సంఘం జిల్లా నాయకులు సి.ఆర్.వి.ప్రసాద్, బిఎస్‌పి జిల్లా నాయకులు ఎస్.గుర్రప్ప, లోక్‌సత్తా నాయకులు కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, ముస్లిం జెఎసి నాయకులు బాబుభాయ్, విద్యావంతుల వేదిక కన్వీనర్ ప్రసాద్, రాజ్యాంగ పరిరక్షణ వేదిక భాస్కర్, వివిధ కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, వ్యవసాయ కార్మిక, మహిళ సంఘాల నాయకులు మాట్లాడారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు కె.సత్యనారాయణ, గౌసియా బేగం, దస్తగిరిరెడ్డి, చాంద్‌బాషా, జిల్లాలోని వివిధ మండలాల సిపిఎం నాయకత్వం పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో కంటి వైద్యం

- కంటి ఆస్పత్రి ప్రారంభోత్సవంలో జగన్‌మోహన్‌రెడ్డి



కంటి ఆస్పత్రిని పరిశీలిస్తున్న జగన్ (ఇన్‌సెట్)లో జగన్‌కు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పేదలకు అందుబాటులో కంటి వైద్యాన్ని అందించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం వైఎస్.రాజారెడ్డి ఆస్పత్రి స్థానంలో నూతనంగా నిర్మించిన ఎల్‌వి ప్రసాద్ సంస్థ ద్వారా ఆధునికీకరణ చేసిన రాజారెడ్డి ఐ ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభించారు. ఆస్పత్రి అంతా తిరిగి ఏర్పాట్లను పరిశీలించారు. కంటి పరీక్షలు కూడా చేయించుకున్నారు. పులివెందులలో కొన్ని దశాబ్దాలుగా రాజారెడ్డి ఆస్పత్రి సేవలు అందిస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ ఆస్పత్రిలోనే పనిచేసి రూపాయి వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ ఆస్పత్రిని ఇప్పుడు అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారని చెప్పారు. ప్రముఖ ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, వైఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్పత్రిని అధునీకరించారని తెలిపారు. తక్కువ ఖర్చుతో అత్యాధునిక సౌకర్యాలతో ఇక నుంచి రాజారెడ్డి ఆస్పత్రిలో కంటి వైద్య సేవలు అందుతాయన్నారు. పులివెందుల నియోజకవర్గంలో కంటికి సంబంధించి ఆధునికమైన ఆస్పత్రి లేకపోవడంతో రాజారెడ్డి జ్ఞాపకార్థం ఆ స్థలంలో ఆస్పత్రిని నిర్మించి పేద ప్రజలకు అందించాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. ఆస్పత్రి ఎమ్‌డి నాగేశ్వరావుని అడిగి విషయాలు తెలుసుకున్నారు. కంటి ఆస్పత్రి ప్రారంభానికి వచ్చిన జగన్‌ను వైసిపి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున కలిసి తమ సమస్యలను తెలిపారు. చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ సెల్ఫీలు తీసుకున్నారు. ఏదైనా సమస్యలు ఉంటే అవినాష్‌రెడ్డి అందుబాటులో ఉంటారని ఆయన దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. సమస్యల పరిష్కారం కాకపోతే పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వైసిపి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. రెండు రోజుల పర్యటన ముగించుకొని ఉదయం 11 గంటలకు పులివెందుల నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరుకి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్ కుమార్‌రెడ్డి, ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రి వైస్ చైర్మన్ డాక్టర్ రాజా, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్.మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నాయకులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వైద్యమే లక్ష్యం : ఆస్పత్రి వైస్ చైర్మన్

పేద ప్రజలకు ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా ఎల్‌వి ప్రసాద్ సంస్థ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా రాజారెడ్డి ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేశామని వైస్ చైర్మన్ డాక్టర్ రాజా అన్నారు. రాష్ట్రంలో 151 ఆస్పత్రులు ఉన్నాయని తెలిపారు. ఆధునికమైన సెంటర్లలో పులివెందుల 24వ సెంటరని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వైద్యాన్ని తేవడానికి ఆస్పత్రి నిర్మించామన్నారు. భవిష్యత్తులో ప్రతి గ్రామంలోనూ సెంటర్లను ఏర్పాటు చేసి ఉచితంగా కంటి చికిత్సలను చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో విజయవాడ, వైజాగ్, కడప, భువనేశ్వర్‌లలో సూపర్ సోషల్ సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

కడప ‘ఉక్కు’పై ప్రభుత్వ నిర్లక్ష్యం

- డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో నిధులు కేటాయించి పరిశ్రమ ప్రారంభానికి చర్యలు చేపట్టాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ కోరారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మొన్న జరిగిన కేంద్ర బడ్జెట్ సమావేశాలలో ఉక్కు పరిశ్రమకు తీవ్ర అన్యాయం చేశారని పేర్కొన్నారు. నిధులు కేటాయించని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం నిలదీయకుండా కేంద్ర బడ్జెట్‌కు మద్దతు ఇవ్వడం దారుణమని చెప్పారు. ఎన్నికల హామీలలో కూటమి ప్రభుత్వం ఉక్కుపైన అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి పూర్తి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత వరకు ఒక్క ఇటుక పేర్చలేదన్నారు. జిల్లా ప్రజానీకం కడప ఉక్కు నిర్మాణం పనులు ఎప్పుడు ప్రారంభం అవుతుందా అని ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఒకవైపు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసలు పోతున్నారన్నారు. ఇక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. వెనుకబడిన రాయలసీమకు ఒకింత ఉపశమనం కడప ఉక్కు పరిశ్రమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ఈ నెల 28న ప్రవేశపెట్టే బడ్జెట్ సమావేశాలలో కడప ఉక్కుకు అధిక నిధులు కేటాయించి పరిశ్రమ నిర్మాణ ప్రారంభానికి చర్యలు చేపట్టాలని లేకుంటే కడప ఉక్కు కోసం ఆందోళన బాట తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

భూ కబ్జాదారుల బరితెగింపు

- రెవెన్యూ సిబ్బందిపై భూ కబ్జాదారుడి దాడి
- వేట కొడవళ్లతో దాడికి తెగబడిన వైనం
- ప్రాణభయంతో పరుగులు తీసిన ఆర్ఐ, విఆర్ఒ
- ఆక్రమణలు తొలగిస్తున్న జెసిబికి నిప్పు



అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఆక్రమణలు తొలగిస్తున్న జెసిబి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె గ్రామీణ మండలం, తట్టివారిపల్లి పంచాయతీ సర్వే నెంబరు 1029లో 50 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. అందులో 4 సెంట్ల స్థలాన్ని చలపతి అనే వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారనే సమాచారంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శేషాద్రిరావు, విఆర్ఓ ప్రసాద్ జెసిబిని తీసుకుని సంఘటన స్థలానికి వెళ్లారు. అక్రమ నిర్మాణాలను జెసిబితో తొలగించే ప్రయత్నం చేయగా భూ కబ్జాదారుడైన చలపతి రెవెన్యూ సిబ్బందిపై పరుష పదజాలంతో అసభ్యకరంగా విరుచుకు పడ్డాడు. తన అనుచరులతో కలిసి ఆర్ఐ, విఆర్ఒపై వేట కొడవళ్లు, కర్రలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు తీసుకొచ్చిన జెసిబి డ్రైవర్ గణేష్‌పై దాడి చేశారు. జెసిబిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో డ్రైవర్, రెవెన్యూ సిబ్బంది పరుగులు పెట్టారు. జెసిబి డ్రైవర్ సీటు పూర్తిగా కాలిపోడంతో అద్దాలను ధ్వంసం చేసి భయానక వాతావరణాన్ని సృష్టించారు. సమాచారం అందుకున్న తాలూకా సిఐ కళా వెంకట్రమణ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకోవడంతో దాడికి తెగబడిన చలపతి, ఆయన అనుచరులు పరారయ్యారు. మంటల్లో కాలిపోయిన జెసిబిని స్టేషన్‌కు తరలించారు. ఆర్ఐ శేషాద్రిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చలపతి అతని అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ, విఆర్ఒకు మద్దతుగా నిలిచారు. రెవెన్యూ సిబ్బందిపై జరిగిన దాడి ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా అభ్యర్థిస్తామని విఆర్ఒ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.



రెవెన్యూ సిబ్బందిని పరామర్శిస్తున్న సిపిఎం అన్నమయ్య జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

భూకబ్జాలకు అండగా ప్రభుత్వం : సిపిఎం

భూ కబ్జాలపై కూటమి ప్రభుత్వ పెద్దల ప్రకటనలకు, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సంఘటనలకు పొంతన లేకుండా పోయిందని, భూ కబ్జాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు విమర్శించారు. బసినికొండలో ప్రభుత్వ భూమిలో అధికార పార్టీ పేరు చెప్పుకుంటూ చలపతి అనే అతను ఆక్రమణలకు పాల్పడుతుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులపై దాడికి యత్నించడం దుర్మార్గమన్నారు. రెవెన్యూ అధికారులు తీసుకెళ్లిన జెసిబి అద్దాలు ధ్వంసం చేయడమే కాకుండా పెట్రోల్ పోసి నిప్పంటించాడన్నారు. చలపతి దాడి చేసిన మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శేషాద్రిరావు, విఆర్ఒ ప్రసాద్‌లను పరామర్శించిన శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ అధికారులపై దాడులకు పాల్పడిన చలపతిపై కఠిన చర్యలు తీసుకోవాలని, హత్యాయత్నం కేసు నమోదు చేసి, క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. చలపతి కోళ్లబైలు, బి.కె.పల్లి రెవెన్యూ గ్రామాల్లో కూడా భూ ఆక్రమాణలకు పాల్పడినట్లు బాహటంగానే ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. అధికార పార్టీ అందదండలతో రెచ్చిపోయిన చలపతి మచ్చుకత్తితో రెవెన్యూ అధికారులను చంపుతా అంటూ దాడికి పాల్పడటాన్ని అందరూ ఖండించాలన్నారు. ప్రభుత్వ భూముల రక్షణ కోసం ప్రజలను భాగస్వామ్యం చెయ్యాలని, ప్రభుత్వ భూముల్లో బోర్డులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషా, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అధికారులకు అండగా ఉండాలని, భూకబ్జాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పొలంలో టమోటాలు కోస్తున్న కూలీలు

టమోటా ధరలు పతనం

నిలకడ లేని ధరలు.. రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టమోటా ధరలు ఒకేసారి భారీగా తగ్గడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఆరుగాలం కష్టపడి రూ.లక్షలు ఖర్చు చేసి టమాటా సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో టమాటా రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట బాగా పండినా ధరలు మాత్రం లేకపోవడంతో రైతుల్లో నిరాశ నెలకొంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో 25 కిలోల టమాట బాక్స్ రూ.500 నుంచి రూ.600 ఉండేది. ప్రస్తుతం రూ.150 నుంచి రూ.200 మాత్రమే ఉంది. కూరగాయల మార్కెట్లో మాత్రం కాయలను బట్టి కిలో రూ.10 నుంచి రూ.20 అమ్ముతున్నారు. రైతు దగ్గర నుంచి మాత్రం రూ.5 నుంచి రూ.10కు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమోటా సాగులో పెట్టుబడులు పెరిగి పోతున్నాయి. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతోంది. టమాటా కోతలు, మార్కెట్‌కు తరలింపు, రవాణా, ఎగుమతి దిగుమతి ఖర్చులు లెక్కిస్తే ఒక్కో బాక్స్‌కు రూ.40 వరకు వ్యయమైతుంది. ఒక్కో బాక్సుకు కమీషన్ రూ.10 ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా అన్నింటిని భరించి విక్రయించినా ప్రస్తుత ధరలతో తమకు భారీ నష్టమే వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



మార్కెట్‌కు చేరిన టమోటాలు



గాంధీ విగ్రహానికి లేఖ అందజేస్తున్న నాయకులు

వక్ఫ్ చట్ట సవరణలను తిరస్కరించండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి ప్రతిపాదించిన రాజ్యాంగ వ్యతిరేక సవరణలను తిరస్కరించి వాటి ఆస్తులను రక్షించాలని, రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కడపలోని స్థానిక ఐటిఐ సర్కిల్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బుధవారం ఎపి కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్అలీఖాన్ సిఎంకు పంపిన బహిరంగ లేఖను మహాత్ముడికి నివేదించి విడుదల చేశారు. రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులకు రక్షణగా ఉన్న పాత వక్ఫ్ రక్షణ చట్టం-1995ను మాత్రమే రాష్ట్రంలో అమలు చేస్తామని మరో అనుబంధ తీర్మానాన్ని కూడా ఆమోదించాలని బహిరంగ లేఖలో కోరారు. ప్రభుత్వానికి ముస్లిం మైనార్టీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ముస్లిం మైనార్టీలకు సంబంధించి స్పష్టమైన విధాన ప్రకటనను ప్రకటించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ అనుబంధ మత విద్వేష సంస్థల నుంచి మైనార్టీలను రక్షిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మసీదులు, స్మశాన వాటికలు, దర్గాల అభివృద్ధికి సంబంధించి ఓ నిర్దిష్టమైన ప్రకటనను చేయాలని కోరారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న మత్తవిద్వేష పాలనా విధానాలు, ముస్లిం మైనార్టీలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అమానుషత్వం, మత విద్వేష ప్రసంగాలు, ప్రకటనలను రాష్ట్రంలో నిషేధిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ రక్షణ ఉద్యమాలతో పాటుగా సవరణల చట్టంను వ్యతిరేకిస్తూ ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మయానా రహమతుల్లాఖాన్, నాయకులు ఎస్.హమీద్, దినకర్‌రెడ్డి, కమల్‌బాషా, జహూర్, రహమతుల్లా, మైనుద్దీన్ పాల్గొన్నారు.

గుండెపోటుతో జూనియర్ కాలేజీ లెక్చరర్ మృతి



ప్రజాశక్తి-కడప అర్బన్

ఇంటర్‌మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యుడు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ గణిత అధ్యాపకులు ఎస్.శివ హరిప్రసాద్‌రెడ్డి బుధవారం హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి డిఇసి కన్వీనర్, ఆర్ఐఒ వెంకట సుబ్బయ్య, తోటి అధ్యాపకులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.



విరాళాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థి సతీష్‌బాబు

ల్యాబ్ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ ల్యాబ్ ఏర్పాటుకు పూర్వ విద్యార్థి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ప్రస్తుతం కొండాపురం హైస్కూల్ హెచ్ఎం సతీష్‌బాబు అందజేశారు. స్థానిక పాఠశాలలో బుధవారం హెచ్ఎం ఉమామహేశ్వర్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఆ మొత్తాన్ని అందజేశారు. న్యూ క్యాంపస్‌లో మ్యాథ్స్ ల్యాబ్‌కు సంబంధించినా మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు జాన్ సుందర్ రావు, జయమణి జ్ఞాపకార్థం ఇవ్వానని తెలిపారు. మ్యాథ్స్ ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థిగా తాము చదివిన పాఠశాలకు తమ వంతు సహకారాలు ఎప్పటికీ ఉంటాయని తెలిపారు.

నేడు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఎడ్లచే రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానులకు విశ్వనాథపురం గ్రామానికి చెందిన జరగారెడ్డి కార్తీక్‌రెడ్డి రూ.1,00,116, రెండవ బహుమతిని నెర్రవాడకు చెందిన చల్లా గంగయ్య, కొల్లూరుకు చెందిన పి.క్రిష్ణయ్య సంయుక్తంగా రూ.70,116, మూడవ బహుమతి పార్వతీనగర్ కొండపల్లి విశ్వరూపయ్య కుటుంబ సభ్యులు, చెన్నూరు జ్యువెలర్స్ వారు సంయుక్తంగా రూ.60,116, నాలుగో బహుమతిని నరహరిపురం గ్రామానికి చెందిన పాలెంపల్లె సుబ్బరామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.40,116, 5వ బహుమతి అల్లాడుపల్లె రజకుల సంఘం రూ.20,116, 6వ బహుమతి నరహరిపురం గ్రామానికి చెందిన పి.చిన్న వీరారెడ్డి కుటుంబ సభ్యులు రూ.12,116, 7వ బహుమతి కోడూరు వెంకటేష్ కుటుంబ సభ్యులు రూ.5,116 అందజేయనున్నారు. బహుమతి రాని ఎడ్లకు కన్సోలేషన్ బహుమతి కూడా అందజేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొను ఎడ్ల యజమానులు గురువారం ఉదయం 11గంటలలోపు కమిటీ సభ్యులకు తమ పేర్లు తెలియజేయాలని వారు కోరారు.

అల్లాడుపల్లెలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు

ప్రజాశక్తి - చాపాడు

మహాశివరాత్రి సందర్భంగా మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పిఒ డాక్టర్ పిసి కృష్ణారెడ్డి అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవాలయంలో పోలీస్ శాఖ వారి విన్నపంతో విధులను నిర్వహించారు. ఆలయంలోని క్యూలైన్లను పర్యవేక్షించారు, తోపులాటలు లేకుండా నియంత్రించడం, వృద్ధులు, విభిన్నప్రతిభావంతులకు సాయం చేయడం వంటి కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. డిఎస్పి రాజేంద్ర ప్రసాద్ సూచనల మేరకు విధులు నిర్వహించడం చాలా సంతోషకరమని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పిఒ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్ విద్యార్థులతో మాట్లాడుతూ ఏ విధమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని వాలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వి ఎస్‌వి కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ రవికల్యాణ్ పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థి సతీష్‌బాబు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

- పలువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె



మృతి చెందిన జశ్రితరెడ్డి

మంగళవారం అర్ధరాత్రి రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో జశ్రితరెడ్డి (8) బాలిక అక్కడికక్కడే మృతి చెందిందని సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బాలుపల్లి గ్రామానికి చెందిన వర్దిరెడ్డి జనార్ధన్‌రెడ్డి అతని భార్య అరుణకుమారి, కుమార్తె జశ్రితరెడ్డి, కుమారుడు శ్రీయాన్ తేజ్‌రెడ్డి బెంగళూరు నుంచి స్వగ్రామానికి వస్తేండగా మంగళవారం అర్ధరాత్రి రాయచోటి హైవేలో ఎన్‌టిపిసి వద్ద కడప నుంచి రాయచోటి వైపు వెళుతున్న కారు అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో జశ్రితరెడ్డి మృతి చెందగా, జనార్ధన్ రెడ్డి, అతని భార్య, కుమారుడు గాయపడ్డారు. ఢీకొన్న కారు డ్రైవర్, అతనితోపాటు ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి కూడా గాయాలైనట్లు సిఐ వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆగిన సంచార పశువైద్య ఆరోగ్య సేవలు

- ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సంచార పశు వైద్య ఆరోగ్య సేవలు ఆగిపోవడంతో పశు పోషకులు, కోళ్ల, జీవాల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గానికి రెండు సంచార వైద్య సేవల వాహనాలు అందుబాటులో ఉండేవి. మొదటి విడతగా పులివెందుల, రెండో విడతలో వేంపల్లి కేంద్రాల నుంచి సంచార పశు వైద్య ఆరోగ్య సేవలను అందించేవారు. మొదటి విడత పంపిణీ చేసిన వాహనాలకు సంబంధించి గడువు ముగియడంతో ఈనెల 15వ తేదీ నుంచి సంచార పశు వైద్య ఆరోగ్య సేవల వాహనాలను నిలిపివేశారు. ఈ సంచార వైద్య సేవల వాహనంలో ఒక డాక్టర్, అసిస్టెంట్, డ్రైవరు ఉండేవారు. వీరు రైతుల నుంచి 1962 నెంబర్‌కు ఫోన్ చేస్తే రిజిస్టర్ చేసుకుని రోజుకు 10 గ్రామాల చొప్పున వైద్యులు వెళ్లి సేవలు అందించేవారు. మండల వ్యాప్తంగా ఆవులు, గేదెలు 10,400, మేకలు, పొట్టేలు 24,500, కోళ్లు 6,500 ఉన్నాయి. వీటితోపాటు పెంపుడు కుక్కలు, ఇతర జంతువులు మరో రెండు వేల పైచిలుకు ఉన్నట్లు పశువర్ధక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వం సంచార పశువైద్య సేవలను నిలిపి వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాటి పోషకులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సంచార పశువైద్య సేవలను అందుబాటులోకి తేవాలని వారు కోరుతున్నారు.



నిలిచిపోయిన సంచార పశువైద్య సేవల వాహనం

వైద్య సేవలు నిలిపేసిన విషయం వాస్తవమే..

ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సంచార పశువైద్య ఆరోగ్య సేవలు మొదటి విడతలో పంపిణీ చేసిన వాహనాలు నిలిపి వేసిన విషయం వాస్తవమే. పాత వాళ్లకి గడువు ముగియడంతో వాహనాలను నిలిపి వేశారు. మళ్లీ టెండర్లు పిలిచిన అనంతరం సంచార పశువైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

-శివ ప్రసాద్, ఎడి, పశుసంవర్ధక శాఖ, సింహాద్రిపురం

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

సాంస్కృతిక కార్యక్రమాలు-అన్నదానాలు-ఎడ్లచే బండలాగుడు పోటీలు



దర్శనానికి బారులుదీరిన భక్తులు


ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయం మహా శివరాత్రి సందర్భంగా బుధవారం శివ నామస్మరణతో మార్మోగింది. తెల్ల వారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకునేందుకు బారులుదీరారు. ఆలయ ఆవరణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఇఒ శ్రీనివాసులు పర్యవేక్షించారు. తహశీల్దార్ రమాకుమారి, ఎంపిడిఒ వీం కిషోర్, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి ఏర్పాట్లు పర్యవేక్షించారు. డిఎస్‌పి రాజేంద్ర ప్రసాద్, సిఐ శివశంకర్ యాదవ్, ఎస్ఐ చిన్న పెద్దయ్య భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రం, ఆర్య వైశ్య అన్నదాన సత్రం, సర్వజన అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల నుంచి ప్రజలు పానకం వడపప్పు పంపిణీ చేపట్టారు. జాగరణ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

చియ్యపాడులో శివపార్వతుల కల్యాణం

చియ్యపాడులో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముద్దనూరు : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటికిటలాడాయి. భక్తులు ప్రత్యేకపూజలు చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొందలకుంటలో 800 ఏళ్ల చరిత్ర కలిగిన బసవేశ్వరస్వామి ఆలయాన్ని పిసిసి అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి సందర్శించారు. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి ఆధ్వర్యంలో పూజారి రాధాకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చక్రాయపేట మండలం సీనియర్ రాజకీయ నాయకులు బందలకుంట ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామిరెడ్డి, బషీర్, అమర్, ఉత్తన్న, రాజు, ఐచర్ రమణ, వినయ్ పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో బ్రహ్మంగారు, గోవిందమాంబ మూలవిరాట్‌లు

బ్రహ్మంగారిమఠం : జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్యాచారి ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్ళు, క్యూలైన్‌లలో మజ్జిగ పంపిణీ చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో విచ్చేశారు. శ్రీజగన్మాత ఈశ్వరిదేవి మఠంలో మఠాధిపతులు వీర శివకుమార్ స్వామి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ఒంటిమిట్ట : మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుండి శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. ఒంటిమిట్ట శ్రీశ్రీశ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, కొత్త మాధవరం దగ్గర ఉన్న శ్రీమృకుండాశ్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భారీగా అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని మహేశ్వరయ్య ఆధ్వర్యంలో చేపట్టారు.

జమ్మలమడుగు రూరల్ : మహాశివరాత్రిని పురస్కరించుకుని జమ్మలమడుగు పట్టణంలోని శివాలయాలు, మండల పరిధిలోని కన్యతీర్థం, మైలవరం మండలంలోని అగస్త్యేశ్వరస్వామి కోనతోపాటు కర్మలవారిపల్లెలో ముద్దనూరు ఎఒ మారెడ్డి వెంకటకృష్ణారెడ్డి సొంత గ్రామంలో స్థానికుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు ఎంసి పుల్లారెడ్డి, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వేంపల్లె : స్థానిక పాపాగ్ని నది ఒడ్డున వెలసిన గవి మలేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటాడింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గవి మలేశ్వర స్వామి ఆలయాన్ని ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారుజామునే భారీ సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో ఆలయ పరిసర ప్రాంతం వారితో పోటెత్తింది. ఆలయ ప్రధాన అర్చకుడు దుర్భాక ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్ ఏర్పాటు చేశారు. తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేపట్టారు. అనంతరం వేంపల్లె పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

చక్రాయపేట : మహాశివరాత్రి సందర్భంగా చక్రాయపేటలో శ్రీవెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో బుధవారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఒకే వేదికపై తిరుమల తిరుపతి దేవస్థాన వేద పండితులు ఎంవి రాయల్‌స్వామి మనోహర్ ఆచార్యులు, రామాయణం స్వామి, అశోక్‌కుమార్ స్వామి, మోహనకృష్ణ స్వాముల వారు శివ పార్వతులకు, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వాములకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పిసిసి అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి హాజరయ్యారు. ఎడ్ల పోటీలను ప్రారంభించారు. మల్‌రెడ్డి మురళీధర్ రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. 10జతలు ఎద్దు పోటీల్లో పాల్గొనగా మొదటి బహుమతి రూ.70 వేలు సురభి ఉప సర్పంచ్ దాసరి ఆంజనేయులు అందజేశారు. రెండో బహుమతి రూ.50 వేలు తుమ్మలూరు గంగాధర చెరుకుంపల్లి గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ అందజేశారు. మూడో బహుమతి రూ.40వేలు కొనసాని రాజారెడ్డి, మద్దిరేవుల రామ చంద్రారెడ్డి సంయుక్తంగా అందజేశారు. ఇలా ఎనిమిది బహుమతులను దాతలు అందజేశారు. పాల్గొన్న ప్రతి ఎడ్లకు కన్సోలేషన్ బహుమతి అంద జేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్లు, కర్నాటి హరినాథ రెడ్డి, చక్రపాణి రెడ్డి, ఓబుల్‌రెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు, ఉత్సవాలకు సహాయం అందించిన దాతలు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ రామాంజనేయరెడ్డి

కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, టిడిపి నాయకులు వెంకట్రామిరెడ్డి, దిలీప్ యాదవ్, రామ్మోహన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, రామచంద్రయ్య రాజు, సురేందర్ రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్ప పుణ్య కార్యక్రమని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ లక్ష్మి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా నల్లగుట్టపల్లి పంచాయతీ కర్ణపువాండ్లపల్లి కర్ణపు రామ్మోహ న్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కల్పనాయుని చెరువు గ్రామంలో వెలసిన శివాలయం నందు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో కూడా మంత్రి మడ్డిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.



భోజనాన్ని అందిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



వంతెనపై సగ భాగంలో వెలుతున్న వాహనాలు

ఆదమరిస్తే.. అంతే..!

ప్రజాశక్తి - పెద్దముడియం

అసలే.. అది ఏళ్ల నాటి పాత వంతెన.. పైగా వంతెనకు ఇరువైపులా రక్షణగోడ లేదు. దానిపై రైతులు పంట నూర్పిళ్లు చేపడుతున్నారు. వంతెన ఇరుకుగా మారింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని వాహనదారులు హడలిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. పెద్దముడియం మండలం నెమల్లదిన్నె గ్రామ సమీపంలోని కుందూ వంతెనపై రైతులు పంట నూర్పిళ్లు చేపడుతున్నారు. ఇది ప్రమాదకరంగా మారింది. వాహనాల రాక పోకాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పంట నూర్పిళ్ల వల్ల పట్టు తప్పితే ప్రాణాలకే ముప్పని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వంతెనపై ఏ మాత్రం అజాగ్రత్త వహించినా పెద్ద ప్రమాదం జరుగుతుందని హడలి పోతున్నారు. వంతెనపై రైతుల పంట నూర్పిళ్లు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు ఏమాత్రం రైతులకు సూచలను చేయలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ జాఫర్ సాదిక్

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని ఎంఇఒ జాఫర్ సాదిక్ పేర్కొన్నారు. స్థానిక ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ సాదిక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ ముఖ్యమన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రణాళికబద్ధంగా చదవాలని కోరారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి అనేది చాలా ముఖ్యమన్నారు. పరీక్షల భయం విద్యార్థుల్లో ఉండకూడదన్నారు. అనంతరం అయా పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్, పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షులుగా ప్రదీప్‌రెడ్డి

-పట్టణ అధ్యక్షులుగా సి.ఆర్.చిన్నికృష్ణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట వైసిపి మండల అధ్యక్షులుగా ప్రదీప్ రెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షులుగా సి.ఆర్.చిన్నికృష్ణలను నియమిస్తూ పార్టీ అధిష్టానం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసిపి అధ్యక్షులు అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వీరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవులు అప్పగించినందుకు మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథ్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలం, నగర పంచాయతీ పరిధిలో వైసిపిని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని, 2029లో వైసిపిని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చి, మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని అన్నారు. తమకు ఈ పదవులు రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.



అడవికి నిప్పు పై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

అడవికి నిప్పు..మూగజీవాల ప్రాణాలకు ముప్పు

-డిప్యూటీ ఆర్ఒఐ మదన్‌మోహన్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అడవికి నిప్పు పెట్టి మూగజీవాల ప్రాణాలు తీయకు అని మదనపల్లి అటవీశాఖ డిప్యూటీ ఆర్ఒఐ మదన్‌మోహన్ అన్నారు. బుధవారం తవళం అటవీశాఖ బీటు పరిధిలో ఎఫ్‌బిఒలు దీప, త్యాగరాజులతో కలిసి అడవికి నిప్పు పెట్టడంపై అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతంలోని నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం వద్ద భక్తులకు అడవి జంతువు పెట్టడంపై అవగా కల్పించారు. అడవికి నిప్పు పెట్టడం ద్వారా అనేక నష్టాలు ఉన్నాయని తెలిపారు. అరుదైన వన్యప్రాణులు, మూగజీవాలు మృత్యువాత పడతాయని అన్నారు. అడవిలో పచ్చదనం లేకపోవడంతో వాతావరణంలో అనుకూల మార్పులు ఏర్పడవని, తద్వారా సకాలంలో వర్షాలు కూడా రావన్నారు. అడవిని కాపాడుకోవడం, వృక్ష సంపదను కాపాడుకోవడం, వన్యప్రాణులు, మూగజీవాలను సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ప్రజలు అడవుల ప్రాముఖ్యతను తెలుసుకొని వాటిని అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



దుకాణంలో నుంచి వస్తున్న పొగ, మంటలు

షార్ట్ సర్క్యూట్‌తో ఫ్యాన్సీ దుకాణం దగ్ధం

- దాదాపు రూ.20 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మెయిన్ బజార్‌లో ఉన్న మిట్ట ఫాన్సీస్టోర్ బుధవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. పట్టణానికి చెందిన మిట్టా చంద్రశేఖర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. దుకాణంలో మంటలు చెలరేగాయి. మూడంతస్తులో ఉన్న దుకాణంలోని ప్లాస్టిక్ వస్తువులు, ఇతర సామగ్రి కాలిపోయాయి. దుకాణంలో నుంచి దట్టమైన పొగలు వస్తున్నడంతో స్థానికులు గుర్తించి ఫైర్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఫైర్ అధికారి కిరణ్ కుమార్‌రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపు కాకపోవడంతో వేంపల్లి, యుసిఐఎల్ ఫైర్ అధికారులకు సమాచారం అందించగా.. వేంపల్లి ఫైర్ అధికారి శివరాం రెడ్డి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. దుకాణంలో గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని చెప్పడంతో అవి ఎక్కడ పేలుతాయో అని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణం మూడంతస్తులలో ఉన్న సుమారు రూ.20 లక్షల విలువ చేసే వస్తువులు కాలి బూడిదయ్యాయి. అంతేకాకుండా దుకాణంలో ఉన్న నగదు, బంగారం అగ్నికి దగ్ధమయ్యాయని బాధితుడు మిట్టా చంద్రశేఖర్ వాపోయాడు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

గంగమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు : డిఎస్‌పి

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లి

గంగమ్మ జాతరకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గంగమ్మ దేవత ఆలయం వద్ద సిఐ వెంకట కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 300 మంది సిబ్బందిలో 24 మంది ఎస్ఐలు, ఏడుగురు సీఐలు ఈ జాతరలో బందోబస్తులో పాల్గొంటారన్నారు. క్యూలైన్, సాంస్కృతిక కార్యక్రమాలు, పార్కింగ్ లకు ఈ బందోబస్తును విభజించామన్నారు. జాతర ఉత్సవాలకు సిసి కెమెరాలతో నిఘా ఉంచినట్లు తెలిపారు. జాతరలో కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేశామని, డ్రోన్ కెమెరాలతో సైతం పర్య వేక్షిస్తామని చెప్పారు. మద్యం దుకాణాలు వెలిస్తే కేసులు నమోదు చేస్తామని, అశ్లీల నృత్యాల ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు.